క్లుప్తంగా

మల్లమ్మకు ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న మల్లమ్మ

వీరబల్లి : మండలంలోని ఓడివీడు కస్పాలో వెలసిన మల్లమ్మకు గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అదే విధంగా అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. హాజరైన భక్తులకు ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. అదేరోజు రాత్రి భక్తులు కోసం జాతరలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు అమ్మవారికి పూజలు చేసి దీవెనలు అందుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వహకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా గంగ జాతర



ప్రత్యేక అలంకారంలో గంగమ్మ

చిట్వేలి : మండలంలోని కెఎస్ అగ్రహారంలో గురువారం గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. స్థానిక మిట్ట పైన అమ్మవారి విగ్రహాన్ని తయారు చేసి గురువారం తెల్లవారు జామున పోతుల రాజు ముందు నడుస్తుండగా అమ్మవారు గుడికి బయలుదేరింది. ఊరేగింపు వెంట భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారు గుడికి చేరాక గ్రామస్తులు పొలిబలి తిరిగారు. సాయంత్రం పందేరపు బండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కార్పొరేషన్ చైర్మన్ కెకె చౌదరి గంగమ్మను దర్శించుకున్నారు. రైల్వేకోడూరు రూరల్ సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్ఐ నవీన్ కుమార్ వారి సిబ్బంది పటిష్ట బందోబస్తు కల్పించారు. మండలం నలుమూలల నుంచి వచ్చిన బంధువులు,స్నేహితులతో గ్రామం కళకళలాడింది. రాత్రి ఆసాదివారు కథచెప్పి గంగమ్మతల్లిని స్థానిక నదిలో నిమజ్జనం చేశారు.

అప్పారాజుపేటలో గ్రామ సభ

పుల్లంపేట : మండల పరిధిలోని అప్పారాజుపేటలో ఉప సర్పంచ్ ముస్తాక్ ఆధ్వర్యంలో గురువారం గ్రామ సభ నిర్వహించారు. ముఖ్యంగా గ్రామాలలో మత్తుపానీయాలు వలన కలిగే అనర్ధాలు, బాల బాలికలు హక్కులు గురించి వివరించారు. అనంతరం ముస్తాక్ మాట్లాడుతూ బాలబాలికల కోసం అనేక చట్టాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ చెడు అలవాట్లకు దూరంగా ఉంటే కుటుంబానికి ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు. అనంతరం పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పుల్లంపేట ఎస్ఐ శివకుమార్, ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ఊరేగింపు

సిద్దవటం : మండల కేంద్రం పరిధి దిగువపేటలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా గురువారం సీతా, రామ లక్ష్మణ ఆంజనేయ విగ్రహాలను ఊరేగించారు. ఈ సందర్భంగా ఉదయం ప్రభాతసేవ, ప్రధాన కలశ షోడశోపచార పూజలు, యంత్రములకు, మూల విరాట్‌లకు పూజలు అనంతరం మూల విరాట్‌లను ట్రాక్టర్ ఉంచి సిద్దవటం దిగువపేట గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామి వారికి కాయా, కర్పూరాలను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

మోడల్ స్కూల్ విద్యార్థులకు ప్రతిభ అవార్డులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

పెనగలూరు : మండలంలోని మోడల్ స్కూల్‌లో ముగ్గురు విద్యార్థులకు ప్రతిభ అవార్డులు లభించినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సహజా బ్లెస్సీ తెలిపారు. పదో తరగతి 2024-25 విద్యా సంవత్సరానికి విద్యార్థులకు మంచి మార్కులు రావడంతో వీరికి ప్రతిభ అవార్డులు వచ్చాయన్నారు. కె మోక్షిత 581, ఎం.మోక్ష ప్రియ 572, సుధీర్ 571 మార్కులు సాధించినట్లు వారు తెలిపారు. ప్రతిభా అవార్డులకు ఎంపికైన ముగ్గురు విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

ఆకట్టుకున్న 'దుర్యోధనుని వధ'



నాటక ఘట్టాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

చిన్నమండెం : మండలంలోని మల్లూరు గ్రామం మాండవ్యానది ఒడ్డున వెలసియున్న శ్రీ మల్లూరమ్మ ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న మహాభారత యజ్ఞం వైభవంగా సాగుతోంది. ప్రముఖ భాగవతారిణి సీతాలక్ష్మిచే మహాభారత యజ్ఞాన్ని వివరించారు. కాగా గురువారం జరిగిన దుర్యోధనుని వధ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వేసవిలో కొనుగోళ్లు ఢమాల్!

- పడిపోయిన ఏసీలు, కూలర్లు, ఫ్రిజ్‌ల అమ్మకాలు
- గతంలో వేసవి ప్రారంభానికి ముందు నుంచే సమ్మర్ సేల్స్ జోరు
- ఎండలు మండుతున్నా.. సంక్షేమం జాడ లేక జనం జేబులు ఖాళీ



బోసిపోయి కనిపిస్తున్న రాయచోటిలోని ఓ దుకాణం

రాయచోటి జగదాంబ సెంటర్ : వేసవి వస్తుందంటే వినియోగదారులతో కిటకిటలాడుతూ కనిపించే ఏసీ, ఫ్రిజ్, కూలర్లు తదితర హోమ్‌నీడ్స్ షాపులు ఈ సమ్మర్ సీజన్‌లో వెలవెలబోతున్నాయి. సమ్మర్ సేల్‌లో మూడు నెలలు గడిచిపోగా 50 శాతం కూడా అమ్మకాలు జరగలేదని వ్యాపార వర్గాలంటున్నాయి. జనం దగ్గర డబ్బులు లేకపోవడం, విద్యుత్ చార్జీలు పెరిగిపోవడం సేల్స్ పడిపోవడానికి కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జనాలు లేక షాపులు వెలవెల

అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలోని పలు దుకాణాలు జనాలు లేక వెలవెలబోతున్నాయి. స్థానిక వ్యాపారులకు చెందిన ఎలక్ట్రికల్ హోమ్‌నీడ్స్ దుకాణాలు పలు దుకాణాలు ఉన్నాయి. దానికి తోడు బజాజ్, సత్య లాంటి ప్రముఖ కంపెనీలకు చెందిన బ్రాంచీలు, కార్పొరేట్ షోరూమ్‌లూ ఉన్నాయి. ఆయా సంస్థలు, ఈ-కామర్స్‌లో సమ్మర్ సేల్స్ ఈసారి పడిపోయాయని దుకాణ యజమానులు వాపోతున్నారు.

మార్చి నుంచే మొదలు

ఎండల తీవ్రత పెరగడం వలన ఏసీలు, ఫ్రిజ్‌లు, కూలర్లు, ఇన్వర్టర్ల సమ్మర్ సేల్స్ మార్చి నుంచే మొదలవుతాయి. ముమ్ముందు మరింత పెరిగి ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం కోసం ఆయా గృహోపకరణాల కొనుగోలుకు ఆసక్తి చూపిస్తారు. కొత్తగా కొనేవారు కొందరైతే, ఎక్స్ఛేంజ్ ఆఫర్‌లో పాత వాటిని ఇచ్చేసి కొత్త వస్తువులను తీసుకునే వారు మరికొందరు. ఆన్‌లైన్‌తో పాటు షాపుల్లోనూ ఈఎంఐల పద్ధతిలో ఫైనాన్స్ సదుపాయం ఉండటంతో పేద, మధ్య తరగతి వర్గాల వారు నెలనెలా వాయిదాలు కట్టుకోవచ్చన్న భావనతో ఏసీలు, ఫ్రిజ్‌ల కొనుగోలుకు ప్రాధాన్యమిస్తున్నారు. ఎన్నికల ప్రభావం వలన గతేడాది అనుకున్న దాని కంటే దాదాపు రెట్టింపు అమ్మకాలు జరిగినట్లు రాయచోటి పట్టణానికి చెందిన ఓ వ్యాపారి తెలిపారు. సమ్మర్ సీజన్ కోసం మార్చికి ముందే వ్యాపారులు స్టాకులు పెట్టుకున్నారు.

చుక్కలు చూపిస్తున్న విద్యుత్ చార్జీలు

కూటమి పాలనలో విద్యుత్ చార్జీలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. సాధారణ వినియోగమే అయినా గతంతో పోలిస్తే రెట్టింపు బిల్లులు వస్తున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. అప్పు చేసి ఏసీ కొందామన్న విద్యుత్ చార్జీలు మరింత పెరిగిపోతాయని వీటిని సాకుగా చూపించి ప్రభుత్వం భవిష్యత్తులో తమకు సంక్షేమ పథకాలు రాకుండా చేస్తుందన్న భయంతో పేద, మధ్య తరగతి వర్గాలు వెనుకడుగు వేస్తున్నారు. దీంతో వినియోగదారులు లేక షాపులు వెలవెలబోతున్నాయి. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో సగం అమ్మకాలు కూడా జరగలేదని వ్యాపారులు అంటున్నారు. కస్టమర్లను ఆకర్షించేందుకు ఆఫర్లు ప్రకటిస్తున్నా అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయని, గతంలో ఎప్పుడూ ఇటువంటి పరిస్థితి చూడలేదని చెబుతున్నారు.

వ్యాపారం ఏమీలేదు



ఎన్నో ఏళ్లుగా హోమ్‌నీడ్స్ వ్యాపారం చేస్తున్నాను. ఏటా సమ్మర్ సీజన్‌లో 70 వరకు ఏసీలు, కూలర్లు అమ్మేవాళ్లం. ఈ ఏడాది సరిగా అమ్మకాలు జరగడం లేదు. మూడు నెలలు గడిచినా ఇంకా 30 యూనిట్లు కూడా అమ్మలేదు. ఫ్రిజ్‌లు, కూలర్ల సేల్స్ కూడా పడిపోయాయి. గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి చూడలేదు.

– కె.రెడ్డిభాస్కర్‌రెడ్డి, సూర్య ఎంటర్‌ప్రైజెస్ యజమాని, బస్టాండు రోడ్డు, రాయచోటి

బలిజపల్లె గంగమ్మకు విశేష పూజలు



పట్టణంలో కోలాహలంగా సాగుతున్న చాందినీ బండి

రాజంపేట టౌన్ : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన బలిజపల్లె గంగమ్మకు గురువారం భక్తులు పెద్దఎత్తున పూజలు చేశారు. వేసవి సెలవులు ముగుస్తుండటంతో విద్యార్థులు కళాశాలల్లో చేరడం, చదువుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లనుండటంతో గంగమ్మకు మొక్కులు తీర్చుకుంటున్నారు. ఈ సందర్భంగా అనేక మంది అమ్మవారికి ఇష్టమైన నైవేద్యాలు సమర్పించారు. కోళ్లు, మేకపోతులు, పొట్టేళ్లను బలులుగా అర్పించారు. సల్లంగా చూడమ్మా గంగమ్మా అంటూ మొక్కుకున్నారు. అనుకున్న పనులు సవ్యంగా జరిగితే వచ్చే ఏడాది ఇష్టమైన నైవేద్యాలు సమర్పిస్తామని వరపడ్డారు. ఇదిలావుంటే పలువురు పందారపు బండ్లు, చాందిని బండ్లు సైతం కట్టారు. ఈ సందర్భంగా భక్తులు తప్పెట్ల దరువుకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ ముందుకు సాగడంతో పట్టణంలో కోలాహల వాతావరణం నెలకొంది. అలాగే బలిజపల్లె గ్రామంలో చిన్నపాటి జాతర సందడి కనిపించింది.

బక్రీద్ ప్రార్థనలకు ఈద్గాలు ముస్తాబు

ఈద్గాలలో చేపట్టనున్న ప్రత్యేక ప్రార్థనల సమయాలు	
పట్టణంలోని పాతఈద్గాలో	– 7:30
మన్నూరు ఈద్గాలో	– 7:30
బ్రాహ్మణపల్లె ఈద్గాలో	– 8:00
ద్వారకానగర్ ఈద్గాలో	– 8:30
రహమతీయ మసీదులో	– 8:30



ప్రత్యేక ప్రార్థనలకు ముస్తాబైన బ్రాహ్మణపల్లెలోని ఈద్గా

రాజంపేట టౌన్ : ముస్లింలు రంజాన్ తరువాత అత్యంత భక్తిశ్రద్దలతో జరుపుకునే పండుగ బక్రీద్. త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలు సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. సామూహిక ప్రార్థనల వల్ల ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తుంది. ముస్లింలు శనివారం బక్రీద్ పండుగను అత్యంత ఘనంగా నిర్వహించకోనున్నారు. అందులో భాగంగా పండుగకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఇదిలా వుంటే బక్రీద్ రోజున ముస్లింలు ఈద్గాల్లో పెద్దఎత్తున ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. అందువల్ల మండలంలోని ఈద్గాలను ముస్తాబు చేశారు. అలాగే ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. ఆయా ఈద్గా కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ప్రార్థనల సమయాన్ని విలేకరులకు తెలిపారు.

బేబీ వార్మర్‌తో పేదలకు ప్రయోజనం

ఓబులవారిపల్లె : ముక్కావారిపల్లి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వాయుపుత్ర పల్వరైజింగ్ మిల్లు యజమాని కొలూరు రమణారెడ్డి బేబీ వార్మర్‌ను గురువారం ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో పరిసర గ్రామాల పేద మహిళలు కాన్పులకు ఎక్కువగా వస్తున్నారని, ప్రసవించిన బిడ్డ పరిస్థితి సరిగా లేకపోతే హుటాహుటిన కడప, తిరుపతికి పరుగులు తీయాల్సి వస్తుందని, తద్వారా ఎంతో ఖర్చుతో కూడుకున్న పనిఅన్నారు. దాదాపు రూ. 50 వేలు విలువచేసే బేబీ వార్మర్‌ను కొలూరి రమణారెడ్డి అందజేయడం హర్షనీయమని, ఎంతో మంది పేద పిల్లలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. తదుపరి ఆరోగ్య కేంద్రం సిబ్బంది రమణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెనగలూరు : మండల కేంద్రంలోనిమోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగిలిన ఖాళీలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ సహజా బ్లెస్సీ తెలిపారు. అలాగే 7, 8వ తరగతులలోనూ మిగిలిపోయిన సీట్లకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 7వ తరగతిలో మూడు సీట్లు, 8వ తరగతిలో ఒక సీటు ఖాళీగా ఉందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఆధునిక సాగు పద్ధతులతో దిగుబడులు



మాట్లాడుతున్న మండల ఏఓ రమేష్‌రెడ్డి

సిద్దవటం : రైతులు ఆధునిక పద్ధతులతో పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి తెలిపారు. సిద్దవటం మండలంలోని మాచుపల్లె, టక్కోలు గ్రామాల్లో ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలు, సబ్సిడీల గురించి వివరించారు. అలాగే వరి పంటలో పోషక యాజమాన్యం, చీడ, పీడలు, తెగుళ్ల యాజమాన్యంపై తెలియజేశారన్నారు. కె.వి.కె. శాస్త్రవేత్త డాక్టర్ మహేష్‌బాబు మాట్లాడుతూ భారత ప్రభుత్వం రైతుల ఆదాయం పెంచాలనే ఉద్దేశంతో ఖరీఫ్ సీజన్‌లో వారి సమస్యలను తెలుసుకొని ప్రణాళికలు ఏర్పాటు చేసుకోవడానికి ఈ కార్యక్రమం దేశం మొత్తం 15 రోజుల పాటు నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. రైతుల కోసం కృషి విజ్ఞాన కేంద్రం అందిస్తున్న విస్తరణ సేవలపై అవగాహన కల్పించారు. ఉద్యాన శాస్త్రవేత్త మానస మాట్లాడుతూ మామిడి, కూరగాయ పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చీడ, పీడ, యాజమాన్య పద్ధతులను సూచించారు. ఉద్యాన కళాశాల సహాయ ఆచార్యులు వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ అరటిలో గెలల యాజమాన్యం, పోషకాలు, చీడీ పీడల యాజమాన్యం గురించి వివరించారు. కార్యక్రమంలో గిరీష్‌కుమార్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ ఉద్యాన, వ్యవసాయ సహాయకులు, ఆయిల్ పామ్ కంపెనీ ప్రతినిధులు, టక్కోలు, మాచుపల్లె గ్రామాల రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల పక్షపాత ధోరణి

- కలెక్టర్ ఆదేశాలు పట్టించుకోకుండా అధికార పార్టీ నాయకులకు వత్తాసు



మద్దిరాల ప్రసాద్ రెడ్డి, మాజీ సర్పంచ్



కంచెను తొలగించిన మండల రెవెన్యూ అధికారులు

గాలివీడు : కొర్లకుంట గ్రామానికి చెందిన మద్దిరాల ప్రసాద్‌రెడ్డికి సర్వే నంబర్ 190-1లో ఉన్న 93 సెంట్ల జాగా ఉంది. ఇందులో రాళ్లతో నిర్మించిన కంచెను మండల రెవెన్యూ అధికారులు ఏకపక్షంగా తొలగించడం దారుణమని ఆ గ్రామ మాజీ సర్పంచ్ మద్దిరాల ప్రసాద్ రెడ్డి రెవెన్యూ అధికారుల తీరుపై ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం ఒక మీటర్ ప్రభుత్వ భూమి ఉందన్న కారణంతో కంచెను తొలగిస్తున్నామని రెవెన్యూ అధికారులు బదులిచ్చారన్నారు. అదే భూమిని ఆనుకుని ఉన్న వంక పోరంబోకులో టీడీపీ నాయకులకు 3 మీటర్ల వెడల్పుతో 100 మీటర్ల ప్రభుత్వ భూమి ఉందని, ఇది రెవెన్యూ అధికారులకు కనబడలేదా అని ఆయన ప్రశ్నించారు. ఇదే విషయంపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన ఆయన రెండు వర్గాల వారి ఆక్రమణలను తొలగించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. అయితే కలెక్టర్ సూచనలను బేఖాతారు చేస్తూ అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలుకుతూ నా భూమిలో ఉన్న రాళ్ల కంచెను మాత్రమే తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయంపై కోర్టు నుంచి అధికారులకు నోటీసులు అందినప్పటికీ వారు వాటిని పెడచెవిన పెడుతూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. నాకు జరిగిన అన్యాయంపై మండల రెవెన్యూ అధికారులపైన జిల్లా కలెక్టర్, ఎస్పీని కలసి విన్నవించుకోవడంతో పాటు న్యాయం చెయ్యాలని కోరడం జరుగుతుందన్నారు.

కనుల పండువగా గంగ జాతర



గంగమ్మకు పూజలు చేయిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఓబులవారిపల్లె : మండలంలోని చెలంపాలెం గ్రామంలో గురువారం ఘనంగా గంగమ్మ జాతర నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి పెద్దఎత్తున పొంగళ్లు నిర్వహించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా ఇతర గ్రామాల నుంచి బంధువులు పెద్దఎత్తున రావడంతో గ్రామం మొత్తం జాతర వాతావరణం ఏర్పడింది. ఎంపీటీసీ వత్తలూరు రోహిణీకుమార్‌రెడ్డి, డీఆర్‌యూసీసీ మెంబర్ తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, గల్లా శ్రీనివాసులు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి హామీ



ప్రెస్ అకాడమీ చైర్మన్‌ను కలిసిన ఏపీడబ్ల్యూజే నాయకులు

రాజంపేట టౌన్ : జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సీఆర్ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ హామీ ఇచ్చారని ఏపీయూడబ్ల్యూజే తాలూకా అధ్యక్షుడు ఇండ్లూరి చిన్నవెంకటరెడ్డి తెలిపారు. సీఆర్ ప్రెస్ అకాడమి చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆలపాటి సురేష్‌ను ఏపీడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పల్లెటి రామసుబ్బారెడ్డి నేతృత్వంలో జర్నలిస్టులు కలసి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు వెంకటరెడ్డి గురువారం ఇక్కడి విలేకరులకు తెలిపారు. రాజంపేటలో అసంపూర్తిగా ఉన్న ప్రెస్‌క్లబ్ నిర్మాణం, జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు తదితర సమస్యలను ఆలపాటి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షులు బచోటి భాస్కర్, నాయకులు కళాంజలి, మండ్ల శ్రీహరి, మంద శివయ్య, కొమ్మినేని మధుసూదన్, చామంచి వెంకటసుబ్బయ్య, పోగట తోటి శివ తదితరులు పాల్గొన్నారు.

యోగాపై అవగాహన ర్యాలీ



రాజంపేట : రాజంపేటలో గురువారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా యోగాపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఆర్ అండ్‌బీ బంగ్లా నుంచి బస్టాండు వరకు ర్యాలీ కొనసాగింది. యోగాంధ్ర - మన ఆంధ్ర అని ర్యాలీలో నినదించారు. అనంతరం మానవహారం చేపట్టారు. యోగా శిబిరంలో నిపుణులు నేతృత్వంలో వివిధ యోగాసనాలు వేశారు. ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ, ఐసీడీఎస్, వైద్యులు, ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశ వర్కర్లు, మెప్మా, సచివాలయ సిబ్బంది పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అన్నమాచార్య ఫార్మసీలో..

అన్నమాచార్య ఫార్మసీలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. డా.కె.జవహర్ జహన్, యోగా ప్రాక్టీషనర్ కె.ప్రసన్నలు యోగాపై అవగాహన కల్పించి ఆసనాలపై శిక్షణ ఇచ్చారు. ప్రిన్సిపాల్ డా.స్వర్ణలత, ప్రదీప్ కుమార్, ఎన్ఎస్ఎస్ యూనిట్ బృందం పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలి



రాజంపేట: పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే

రాజంపేట : ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలని రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే అన్నారు. బక్రీద్ పండుగను దృష్టిలో ఉంచుకొని ఏఎస్పీ క్యాంప్ కార్యాలయంలో వివిధ మతాల పెద్దలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలు మతసామరస్యానికి ప్రతీకలన్నారు. హిందూ, ముస్లిం ఒకరికొకరు కలసిమెలసి పండుగులను ప్రశాంత వాతవరణంలో చేసుకోవాలన్నారు. పరస్పరం ఒకరినకొరు గౌరవించుకోవాలన్నారు. పండుగలు మన సంప్రాదాయలకు చిహ్నాలన్నారు. ముస్లిం సోదరులు ప్రశాంత వాతవరణంలో బక్రీద్ పండుగ జరుపుకునేలా పోలీసుశాఖ అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా బందోబస్తును పటిష్టం చేస్తామన్నారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ రాజా, మన్నూరు సీఐ కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

వీరబల్లి : హిందూ ధర్మాన్ని కించపరచకుండా ఎలాంటి గోహత్యలు చేయకుండా ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగ జరుపుకోవాలని ఎస్ఐ నరసింహారెడ్డి తెలిపారు. గురువారం పోలీస్ స్టేషన్ కార్యాలయంలో హిందూ, ముస్లింలతో కలిసి పీస్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో భిన్నత్వంలో ఏకత్వం హిందూ ముస్లింలు అందరూ కలిసి జీవిస్తున్నారని, ఇలాంటి వాతావరణంలో ఎలాంటి గోహత్యలకు పాల్పడకుండా ప్రశాంత వాతావరణంలో సోదర భావంతో పండుగను జరుపుకోవాలని సూచించారు.

లక్కిరెడ్డిపల్లి : హిందూ ధర్మాన్ని కించపరచకుండా ఎక్కడా గోహత్యలు చేయకుండా ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగను జరుపుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు, సీఐ కొండారెడ్డిలు పేర్కొన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో హిందూ, ముస్లింలతో కలిసి పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ ముస్లింలు అందరూ కలిసి జీవిస్తున్నారని, ఇలాంటి వాతావరణంలో ఎలాంటి గోహత్యలకు పాల్పడకుండా ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఉషారాణి, ఎస్ఐ రవీంద్రలు పాల్గొన్నారు.

నందలూరు : హిందూ, ముస్లిం సోదరులు పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ బివి రమణ సూచించారు. గురువారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో మారెమ్మ జాతర, శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు ఉన్నాయని, అదే విధంగా ఇదే సమయంలో బక్రీద్ పండుగ కూడా ఉందని పండుగలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా జరుపుకోవాలని తెలియజేశారు. గోవధ నేరమని ఎవరైనా గోవధకు పాల్పడితే తమకు సమాచారం ఇవ్వాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సుబ్బరాయుడు, హెడ్‌కానిస్టేబుల్ రాజగోపాల్, హిందూ, ముస్లిం సోదరులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లె : భక్తిశ్రద్దలతో ప్రశాంత వాతావరనంలో బక్రీద్ పండుగను జరుపుకోవాలని రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్ ముస్లిం సోదరులకు తెలిపారు. బక్రీద్ పండుగ సందర్భంగా గురువారం జిల్లా వ్యాప్తంగా పీస్ కమిటీ ఏర్పాటు చేసి ముస్లిం మత పెద్దలతో పోలీసులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏవైనా ఇబ్బందులుంటే తెలుసుకుని పరిష్కరించాలనే ఉద్దేశంతోనే ఈ సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. జూన్ 7వ తేదీన బక్రీద్ పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. మండలంలో ఎక్కడా ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా భద్రతా ఏర్పాట్లు చేపట్టామన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే వెంటనే పోలీస్ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు, ఏఎస్ఐ ఆయూబ్‌ఖాన్, ముస్లిం మత పెద్దలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణతోనే మనుగడ

మానవ మనుగడ పర్యావరణ పరిరక్షణ సాధ్యమని అధికారులు తెలిపారు. గురువారం ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని మూడు నియోజకవర్గాల పరిధిలో ఘనంగా నిర్వహించారు. చెట్లను నాటి నీరు పోశారు. పలు చోట్ల అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ప్రజలకు చెట్లను పెంచాల్సిన ఆవశ్యకతను తెలియజేశారు. అధికారులు మాట్లాడుతూ చెట్ల నరికివేతతో కాలుష్యం పెరిగిపోతోందని, చెట్లను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రతి పౌరుడు చెట్లను నాటి పరిరక్షించాలని పిలుపునిచ్చారు.

– సాక్షి,నెట్‌వర్క్



చిన్నమండెం: దేవగుడిపల్లె పంచాయతీ కార్యాలయ ఆవరణలో..



సిద్దవటం: బెటాలియన్ అవరణలో మొక్కలు నాటుతున్న పోలీసులు



సంబేపల్లె: మొక్కలు నాటుతున్న తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి



రాయచోటి జగదాంబ సెంటర్: శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో..



వీరబల్లి: కస్తూర్బా పాఠశాల వద్ద మొక్కలు నాటుతున్న ఎంపీపీ, ఎంపీడీఓలు



రాయచోటిలో మొక్క నాటుతున్న బీజేపీ నాయకులు



పెనగలూరు: ఈటమాపురంలో..



లక్కిరెడ్డిపల్లె: మొక్కలు నాటుతున్న అధికారులు



నందలూరు: మొక్కలు నాటుతున్న లయన్స్‌క్లబ్ సభ్యులు



గాలివీడు: మొక్క నాటుతున్న ఎంపీడీఓ జవహర్